సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం, 5, సెప్టెంబర్, 2023

ఎగువమా'నీరు' పరవళ్లు



గంభీరావుపేట(సిరిసిల్ల): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరి గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. ఈ వర్షాకాలంలో ప్రాజెక్టు పరవళ్లు తొక్కడం రెండోసారి. ప్రాజెక్టుకు ప్రధానాధారమైన సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగుల ద్వారా వరద నీరు భారీగా చేరుతోంది. ప్రాజెక్టును చూసేందుకు ఎవరు రావొద్దని పోలీసులు కోరుతున్నారు.

దంచికొట్టిన వాన



మల్లారం వద్ద పారుతున్న మూలవాగు

- పొంగి ప్రవహిస్తున్న మానేరువాగు
- మూలవాగుపై తెగిన రోడ్లు.. నిలిచిన రాకపోకలు
- జిల్లాలో సరాసరి 80.2 మిల్లీమీటర్ల వర్షం

అత్యధికం :
ఇల్లంతకుంట : 125.0 మిల్లీమీటర్లు

అత్యల్పం :
వేములవాడరూరల్ : 60.5 మిల్లీమీటర్లు

సిరిసిల్ల: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతోంది. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలో భారీ వర్షాలు పడడంతో వరద నీరు ఎగువమానేరులోకి పాల్వంచ, కూడెల్లి వాగుల ద్వారా చేరుతుంది. ఈ సీజన్‌లో మత్తడి పోయడం వరుసగా రెండోసారి. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయం నిండుగా ప్రవహిస్తుంది. వేములవాడ వద్ద మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వేములవాడ మండలం హన్మాజీపేట వద్ద నక్కవాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోనరావుపేట మండలం వట్టిమల్ల–నిమ్మపల్లి, వెంకట్రావుపేట–బావుసాయిపేట, నిజామాబాద్–మామిడిపల్లి మధ్య మూలవాగు ఉధృతంగా ప్రవహించడంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. వేములవాడ–మల్లారం మార్గంలోనూ ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బోయినపల్లి మండలంలోనూ ఒర్రెలు పొంగడంతో కల్వర్టులు కోతకు గురయ్యాయి.



సిరిసిల్లలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

అత్యధికం ఇల్లంతకుంటలో..

అత్యధికంగా ఇల్లంతకుంటలో 125.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వేములవాడరూరల్‌లో 60.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఎల్లారెడ్డిపేటలో 87.6, రుద్రంగిలో 77.9, చందుర్తిలో 66.6, బోయినపల్లిలో 70.2, సిరిసిల్లలో 71.1, వేములవాడలో 63.0, కోనరావుపేటలో 79.6, వీర్నపల్లిలో 105.2, గంభీరావుపేటలో 62.8, ముస్తాబాద్‌లో 81.4, తంగళ్లపల్లిలో 91.7 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 80.2 మిల్లీమీటర్లుగా నమోదైంది.

నిండిన చెరువులు 578

జిల్లాలో వంద ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు 656 ఉండగా.. ఇప్పటికే 578 చెరువులు నిండాయి. ఇందులో 179 చెరువులు మత్తళ్లు దూకుతున్నాయి. 399 చెరువుల్లో నిండా నీటితో ఉన్నాయి. మరో 61 చెరువుల్లో 75 శాతం మేరకు నీరు చేరింది. కేవలం 17 చెరువుల్లో నీరు చేరాల్సి ఉంది. మిడ్‌మానేరు నిండడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. వేములవాడ మండలం జయ్యారం వద్ద చెక్‌డ్యామ్ కోతకు గురికాగా.. ఇరిగేషన్ ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. సిరిసిల్ల వద్ద మానేరువాగు పరవళ్లు తొక్కుతుంది. చలిగాలులతో జనం వణికిపోతున్నారు.

చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాల– చందుర్తి , మర్రిగడ్డ–జోగాపూర్, బండపల్లి– బావుసాయిపేట, చందుర్తి–రామన్నపేట గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న కల్వర్టులు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారి మల్యాల– చందుర్తి గ్రామాల మధ్య కల్వర్టు పైపుల్లో చెత్తచెదారం నిండడంతో పోలీసులు జేసీబీ సహాయంతో తొలగించారు. మల్యాల, బండపల్లి, కట్టలింగంపేట చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. చందుర్తిలో సైడ్ డ్రైయినేజీలు లేక నీరు బయటకపోవడం లేదు.



మత్తడి దూకుతున్న బండపల్లి ఊర చెరువు

వేములవాడరూరల్: మండలంలోని బొల్లారం, లింగంపల్లి వద్ద చెక్‌డ్యాం తెగిపోవడంతో సమీపంలోని పొలాలు కోతకు గురయ్యాయి. బొల్లారం గ్రామంలోని వరద నీరు చేరగా.. వాగు పక్కన ఉన్న నాలుగు కుటుంబాలను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. వాన భారీగా కురిస్తే ప్రమాదం ఉంటుందని భావించిన అధికారులు చెక్‌డ్యామ్‌ను ముందస్తుగా పేల్చివేశారు. ఆ ప్రాంతానికి గ్రామస్తులు వెళ్లకుండా రూరల్ సీఐ కృష్ణకుమార్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, ఎస్సై మారుతి పర్యవేక్షించారు.

నిలిచిన రాకపోకలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ –గాజులపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు.

మత్తడి దూకుతున్న గిద్దె చెరువు

మండల కేంద్రంలోని గిద్దచెరువు మత్తడి దూకుతుంది. అక్కపల్లి సమీపంలోని లేతమామిండ్ల వాగు పొంగిపొర్లుతుండడంతో మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. పాలేటివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నారాయణపూర్ –బండలింగంపల్లి, సింగారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గిద్దచెరువు మత్తడిని తహసీల్దార్ రాంచందర్, ఎస్సై రమాకాంత్ వేర్వేరుగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ గిద్దచెరువు వైపు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. డీటీ జయంత్‌కుమార్, ఆర్‌ఐ సంతోశ్ తదితరులు ఉన్నారు.



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

పొంగిపొర్లిన సంద్రవాగు



ఉప్పొంగి ప్రవహిస్తున్న సంద్రవాగు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సంద్రవాగు ఉప్పొంగి ప్రవహించింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



జేసీబీ ద్వారా నీటిని తీసివేయిస్తున్న అధికారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం బాబాయిచెరువు తండా పరిధిలోని పులిదేవుడి చెరువు నిండడంతో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో నరేశ్ జేసీబీతో కాలువ తీయించి, నీటిని బయటకు పంపించి వేశారు.

రుద్రంగి(వేములవాడ): మండలంలోని మానాలలోని కొత్తచెరువు కట్ట అలుగు వద్ద తెగిపోయింది. చెరువులోని నీరు తాతమ్మ వాగులో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మానాల నుంచి గైదిగుట్టతండా, రుద్రంగి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రంగి ఎంపీడీవో మాలోతు శంకర్, వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, పీఆర్ ఏఈ మనోహర్లు కొత్తచెరువు కట్టను పరిశీలించారు.



తెగిన కొత్త చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు



జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే.. భవిష్యత్‌కు మార్గదర్శకులు.. మనకు విద్యాబుద్ధులు నేర్పి, సన్మార్గంలో నడిచేలా చూడటంలో వారి పాత్ర కీలకం. ఏటా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధిస్తూ ఎంతో ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులు మాత్రం అక్కడే ఉండిపోతారు. తమ శిష్యులు ఉన్నత స్థాయిలో ఉండాలని మాత్రమే కోరుకునే నిస్వార్థపరులు. అది జరిగిన రోజు వారికి కలిగే ఆనందం మరెందులోనూ కలగదు. మనం ఎక్కడున్నా అలాంటి టీచర్లను గుర్తు చేసుకోవాలి. మన దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆయన ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయుల సేవలపై 'సాక్షి' కథనం.

గురుభ్యోనమః

- భవిష్యత్‌కు మార్గదర్శకులు
- జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం టీచర్లదే
- విద్యార్థుల ఉన్నతిని కోరుకునే నిస్వార్థపరులు
- ఏ స్థాయిలో ఉన్నా వారిని గుర్తుంచుకోవాలి

ఈ ప్రపంచంలో ఎన్ని వృత్తులు ఉన్నా.. వారందరినీ తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తే. అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం.
– అబ్దుల్ కలాం




ప్రభుత్వ బడికి జీవం



చార్ట్‌తో బోధిస్తున్న హెచ్‌ఎం సురేశ్

కథలాపూర్(వేములవాడ): సిరికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2013–14లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 68 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో నమోదవగా.. 28 మందే బడికి వచ్చేవారు. ఆ సమయంలో హెచ్‌ఎంగా చింత సురేశ్ బదిలీపై వచ్చారు. పాఠశాల మూతబడే ప్రమాదముందని టీచర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని, ఇంగ్లిష్ మీడియంలో విద్యనందిస్తామని ప్రచారం చేశారు. దీంతో విద్యార్థుల సంఖ్య 130కి చేరింది. టీచర్లు బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. బడికి జీవం పోశారని స్థానికులు అభినందిస్తున్నారు.

ఆకర్షణీయమైన చిత్రాలతో..



వాల్ పెయింటింగ్ ద్వారా బోధిస్తున్న సరిత

ఇల్లందకుంట(హుజూరాబాద్): బూజునూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మాతంగి సరిత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. బడి గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు వేయించి, సులభ పద్ధతిలో పాఠాల బోధనకు చర్యలు తీసుకుంటున్నారు. వసతులు కల్పించడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత



రామడుగు(చొప్పదండి): రుద్రారం హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ కేతు.శ్రవణ్‌కుమార్ విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన చొరవతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులు అవార్డులు సాధించారు. అలాగే పాఠశాలలో గత ఐదేళ్లుగా పదోతరగతి విద్యార్థులు ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూస్తున్నారు.

ఉచిత శిక్షణ కార్యక్రమాలు



పాఠాలు బోధిస్తున్న రమేశ్

ధర్మపురి: ధర్మపురికి చెందిన కాశెట్టి రమేశ్ దోనూర్ ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. మన ఊరు–మన బడి పనులను మొదటి విడతలో పూర్తి చేసి, హరితహారంలో భాగంగా బడిలో మొక్కలు నాటించారు. ఈ ఏడాది ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2006 నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా పలువురు ఉద్యోగాలు సాధించారు.

క్షేత్ర, వైజ్ఞానిక ప్రదర్శనలు



వరినాటు వేస్తున్న అభయ్ రాజ్

రాయికల్(జగిత్యాల): రామారావుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అభయ్‌రాజ్ విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేశారు. ప్రస్తుతం 50 మంది ఉన్నారు. పిల్లలను క్షేత్ర, వైజ్ఞానిక ప్రదర్శనలకు తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులో 25 డిజిటల్ పాఠాలకు రూపకల్పన చేశారు. మంగళవారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోనున్నారు.

'బడిబాట'లో విస్తృత ప్రచారం



శ్రీనివాస్..

జమ్మికుంట(హుజూరాబాద్): మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ యేబూషి శ్రీనివాస్ బాడిబాట కార్యక్రమంలో విస్తృత ప్రచారం చేశారు. విద్యార్థుల సంఖ్యను 65 నుంచి 117కు పెంచారు. మన ఊరు–మన బడి కార్యక్రమంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులకు ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. శ్రీనివాస్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

తెలుగు భాషకు ప్రాధాన్యం



బిందు మాధవి..

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలుగు భాషను బతికించేందుకు బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ బిందు మాధవి కృషి చేస్తున్నారు. విద్యార్థులు తెలుగులో 10 జీపీఏ సాధించడమే ఇందుకు నిదర్శనం. తెలుగు వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ఇక్కడి విద్యార్థులు రాణించారు. అనేక పద్యాలు రాశారు. బిందు మాధవి సేవలను గుర్తించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్



పవన్‌కుమార్..

హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ హైస్కూల్ సోషల్ టీచర్ ఆర్.పవన్‌కుమార్ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. రాష్ట్రస్థాయి సోషల్ స్టడీస్ ప్రతిభా పరీక్షలో ఈ స్కూల్ విద్యార్థి మూడో ర్యాంక్ సాధించాడు. జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానం సాధించారు. పవన్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు.


విద్యార్థులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): వడ్కాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ రెడ్డి చిన్నారులకు సులభమైన పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. స్కూల్లో చేరిన చిన్నారులకు పాఠశాల అవరణలోనే అక్షరాభ్యాసం చేయిస్తున్నారు. బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ముందు వరుసలో నిలిచారు.

బడిని బతికించారు..



సుధాకర్..

మెట్‌పల్లి(కోరుట్ల): సింగపూర్ ప్రాథమిక పాఠశాల 2014లో మూతపడింది. ఇక్కడి ఉపాధ్యాయుడు సుధాకర్ డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమ విద్యను ప్రవేశపెట్టడంతో గతేడాది పాఠశాల తెరుచుకుంది. ఆయన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడంతో వారు అంగీకరించారు. ప్రస్తుతం 15 మంది చదువుతున్నారు.


జగ్గయ్యపల్లి ప్రాథమిక పాఠశాల..



షబానా..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆరేళ్ల మూతపడిన మల్యాల జగ్గయ్యపల్లె పాఠశాలను గతేడాది తిరిగి ప్రారంభించారు. టీచర్ షబానా గ్రామస్తులతో మాట్లాడి, ఒప్పించడంతో 5 తరగతులు 11 మంది విద్యార్థులతో కొనసాగుతున్నాయి. ఆమె ఒక్కరే ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు బోధిస్తున్నారు. ఆటపాటలతో బోధన చేస్తూ మధ్యాహ్నం మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు.

స్కూల్‌కు అవార్డు..



పిల్లలతో ఉపాధ్యాయురాలు మమత

సైదాపూర్: మండల కేంద్రానికి చెందిన మారవేని మమత అమ్మనగుర్తి పీఎస్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. రూ.20 వేలతో ఎల్‌ఈడీ టీవీ, రూ.5 వేలతో కుర్చీలు సమకూర్చారు. వ్యాయామం, ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. టీఎల్‌ఎం 2022–23కు మండల స్థాయిలో పాఠశాలకు ఉత్తమ అవార్డు వచ్చింది. మమత కృషికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు వరించింది.

విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సాహం



శేఖర్ మల్లేశం సదానందం భాస్కర్

సిరిసిల్లఎడ్యుకేషన్/ఇల్లంతకుంట/ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ పాఠశాల ఇంగ్లిష్ టీచర్ గొట్టిముక్కల శేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పాఠశాల నుంచి 15 మంది రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు, నలుగురు నేషనల్ లెవెల్ ఫుట్‌బాల్ పోటీలను ఎంపికవడంలో శేఖర్ కృషి ఎంతో ఉంది. పిల్లలను విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని జవారిపేట ప్రాథమిక పాఠశాల టీచర్ అరుకుటి మల్లేశం శిథిలావస్థలో ఉన్న బడిని బాగు చేయించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రామోజీపేట పాఠశాల టీచర్ రెవోజు సదానందం రెగ్యులర్ విద్యతోపాటు విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించడానికి కృషి చేశారు. డిజిటల్ బోధనకు రాత్రింబవళ్లు శ్రమించి యూట్యూబ్ ఛానల్ ద్వారా వీడియో పాఠాలు రూపొందించగా మంత్రి కేటీఆర్ అభినందించారు. సదానందం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నాయిని భాస్కర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పదేళ్లుగా ఆయన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు.

అత్యుత్తమ శిక్షణ



క్రీడలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

జమ్మికుంట(హుజూరాబాద్): వావిలాల జెడ్పీహెచ్‌ఎస్ వ్యాయమ ఉపాధ్యాయుడు జిట్టబోయిన శ్రీనివాస్ విద్యార్థులకు క్రీడల్లో అత్యుత్తమ శిక్షణనిస్తున్నారు. దీంతో జిల్లా స్థాయి ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్నారు. ఆయన జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధన



మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల టీచర్ ఆరెపల్లి జయప్రద గౌతమి ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తున్నారు. ప్రభుత్వం ఆమెను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది.

'పది'లో ఉత్తీర్ణతకు ప్రణాళికలు



పదోతరగతిలో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికలు రూపొందించి, సక్సెస్ అయ్యాం. గతేడాది ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు పొందారు. – పి.కృష్ణగోపాల్, హెచ్‌ఎం

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా తీర్చిదిద్దుతున్నాం. 2022–23 ఏడాది పదోతరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాం
– పి.వేణుగోపాల్‌రావు, గణిత టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, ఎలగందుల

క్రీడల్లో రాణించేలా..



పిల్లలను క్రీడల్లో భాగస్వాములను చేస్తున్నాం. చాలామంది కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో రాణించారు. పలువురు కానిస్టేబుల్, ఎస్సై, పీఈటీ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.
– నత్తినేని రమేశ్‌కుమార్, పీఈటీ

హ్యాండ్‌బాల్ క్రీడలో పతకాలు



హ్యాండ్‌బాల్ క్రీడకు కేరాఫ్‌గా గుల్లకోటను తీర్చిదిద్దాం. నా కెరీర్‌లో ఆరుగురు విద్యార్థులు జాతీయ పోటీల్లో బంగారు పతకాలు సాధించడం, నలుగురు సాయ్ అకాడమీకి ఎంపికవడం మర్చిపోలేను.– జి.శ్రీనివాస్, పీఈటీ

– సప్తగిరికాలనీ(కరీంనగర్)

క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం సిరిసిల్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 45 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రిటైర్‌మెంట్ వయస్సు 60కి నిర్ణయించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కల్లూరి చందన, ఎదురుగట్ల మమత, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఉన్నారు.

జనారణ్యంలోకి నక్క



నక్కను అటవీప్రాంతంలో వదిలేస్తున్న ఫారెస్టు అధికారులు

రుద్రంగి(వేములవాడ): అటవీ ప్రాంతం నుంచి సోమవారం ఓ నక్క జనావాసంలోకి వచ్చింది. మండల కేంద్రంలోని దరిపెల్లి మహేశ్ ఇంట్లో నక్క చొరబడింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు నక్కను బంధించి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, సిబ్బంది శంకర్ ఉన్నారు.

ఏడో తేదీ వరకు భారీ వర్షాలు

- ఉమ్మడి జిల్లాకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురువనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ఈనెల 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం వెల్లడించింది. ఆమేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో అతిభారీ వర్షాలు కురుస్తాయని, సిరిసిల్లలో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం రాజన్న సిరిసిల్ల, జగిత్యాలలో అతిభారీ వర్షాలు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని వివరించింది. గురువారం మాత్రం ఎల్లో అలర్ట్ ఉంటుందన్నారు. ఆరోజు కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

వైభవంగా మహాలింగార్చన



వేములవాడ: రాజన్న అనుబంధ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం సోమవారం సందర్భంగా మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ, అర్చకబృందం ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఆదాయంపై పట్టింపేది?

- జిల్లాలో తొమ్మిది ఏఎంసీలకు ఇద్దరే కార్యదర్శులు
- చెక్‌పోస్టులపై పట్టింపు కరువు
- ఆదాయం కోల్పోతున్న మార్కెట్ కమిటీలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత



ఇతను పోతుగల్ ఏఎంసీలో పనిచేసే సెక్యూరిటీ గార్డు వెంకటేశ్. ముస్తాబాద్ శివారులోని చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇక్కడ చెక్‌పోస్టుకు గది లేకపోవడంతో ఇలా చెట్టు కిందే నిల్చొని వాహనాలను తనిఖీ చేస్తున్నాడు. ఏదైనా వాహనం పంట ఉత్పత్తులతో వస్తే మొబైల్ ద్వారా ఫీజు వసూలు చేస్తాడు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1.10 లక్షలు వసూలు చేశాడు. ప్రత్యేక గది, సిబ్బంది ఉంటే నెలకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేసే అవకాశం ఉండేది. ఈ పరిస్థితి జిల్లా అంతటా ఉంది.

ముస్తాబాద్(సిరిసిల్ల): వ్యవసాయమార్కెట్ కమిటీలలో సిబ్బంది లేక ఆదాయంపై పట్టింపు కరువైంది. వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ ఫీజు వసూలు చేసే సిబ్బంది కరువయ్యారు. దీంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతుంది. ఇటీవల ఐదు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. జిల్లా వ్యాప్తంగా 9 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా.. సిరిసిల్ల, వేములవాడ మినహా ఎక్కడ కార్యదర్శులు లేరు. ఏళ్లుగా ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు.



పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

రెండు దశాబ్దాలుగా రిక్రూట్‌మెంట్ లేదు

- వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ప్రభుత్వం 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రిక్రూట్‌మెంట్ చేపట్టింది.
- పోతుగల్ కమిటీకి కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పొరుగు జిల్లా నుంచి వచ్చి ఇక్కడ ఎలా పనిచేయగలడో అధికారులకే తెలియాలి.
- గంభీరావుపేట, రాచర్లబొప్పాపూర్, రుద్రంగి, బోయినపల్లి, ఇల్లంతకుంట, వీర్నపల్లి ఏఎంసీల్లో ఇన్‌చార్జీలే పనిచేస్తున్నారు.
- గంభీరావుపేటలో జేఎంఎస్, సెక్యూరిటీగార్డు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఇల్లంతకుంట, వేములవాడలో సూపర్‌వైజర్, కార్యదర్శి, టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- బోయినపల్లిలో ఏఎంఎస్ ఖాళీగా ఉంది.
- బొప్పాపూర్‌లో కార్యదర్శి, సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- పోతుగల్‌లో కార్యదర్శి, సూపర్‌వైజర్, వాచ్‌మెన్,అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఏఎంసీల విధులు ఇవీ..

పత్తి, ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు ఇతర జిల్లాలకు, మండలాలకు తరలించే క్రమంలో చెక్‌పోస్టుల వద్ద మార్కెట్ ఫీజును వసూలు చేయాలి. వ్యవసాయ క్షేత్రాల్లో అవసరమైన చోట లింకు రోడ్లు, కల్వర్టులు, సీసీరోడ్లు నిర్మించాలి. పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. పంట ఉత్పత్తులకు ప్రభుత్వ గిట్టుబాటు ధరలను కల్పించి, దళారీ వ్యవస్థను నిర్మూలించాలి.

పాలకవర్గాలకు సవాల్

సిరిసిల్ల, పోతుగల్, రాచర్లబొప్పాపూర్, గంభీరావుపేట పాలకవర్గాల పదవీకాలం గత జనవరితోనే ముగిసింది. ఏడు నెలల తర్వాత వచ్చిన కొత్త కమిటీలు ఎలా పనిచేస్తాయో వేచిచూడాలి. కొత్తగా వీర్నపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీని పదిహేను రోజుల క్రితం మంజూరుచేసింది. ఇక్కడ కూడా ఇంకా కార్యాలయం గది, కార్యదర్శి, టైపిస్టు, సూపర్‌వైజర్, సెక్యూరిటీగార్డులు, వాచ్‌మెన్లను నియమించాల్సి ఉంది. కొత్తగా ఏర్పడిన వీర్నపల్లి ఏఎంసీ ఇంకా ఉనికిలోకి రాలేదు.

స్టడీటూర్లపై విమర్శలు

మార్కెట్ కమిటీలు చేపట్టే స్టడీటూర్లు ఎందుకు పనికిరాకుండా పోయాయనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 9 ఏఎంసీ పాలకవర్గాలు గతంలో చేపట్టిన స్టడీటూర్లతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందే తప్ప ఒక్క సంస్కరణ చేపట్టలేదనేది వాస్తవం. ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు వెళ్లిన పాలకవర్గాలు అక్కడి వ్యవసాయ విధానం, ఏఎంసీల పనితీరును తెలుసుకుని ఇక్కడ వాటిని అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగలేదు. స్టడీటూర్లు విహారయాత్రలుగానే మిగులుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

వసతులు కల్పించాలి



జిల్లాలోని చాలా వరకు ఏఎంసీలు నామమాత్రంగా ఉన్నాయి. రాజకీయ పోస్టులు కల్పించేందుకే వీటిని ఏర్పాటు చేశారు. వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు, సిబ్బందిని నియమించాలి. రైతులకు మేలు చేసే ఏఎంసీలను బలోపేతం చేయాలి. – మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ

రైతుల ధనం వృథా చేస్తున్నారు



ఏఎంసీలలో వసూలు చేసిన సొమ్ము వృథా చేస్తున్నారు. పాలకవర్గాలు లేక చాలా కమిటీలలో నిధులు పక్కదారి పడుతున్నాయి. ఏఎంసీలలో కనీసం రైతుల విశ్రాంతి గదులు లేవు. మరుగుదొడ్లు లేవు. రైతు ఉత్పత్తులకు ఏఎంసీలు న్యాయం చేయాలి. ఏఎంసీ నిధులపై ప్రభుత్వ ఆజమాయిషీ తగ్గించాలి. – కర్రెళ్ల కొండల్‌రెడ్డి, రైతు నాయకుడు

ఫీజు వసూలు చేస్తున్నాం



ఏఎంసీలలో ఖాళీలు ఉన్నప్పటికీ మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నాం. సిబ్బంది తక్కువగా ఉన్న, ఇన్‌చార్జీలు ఉన్న ఇబ్బందులు తలెత్తకుండా పనిచేస్తున్నాం. ఇన్‌చార్జీలు ఉండడంతో పని ఒత్తిడి ఉన్నా.. సర్దుబాట్లు చేస్తున్నాం. – ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ ఇన్‌చార్జి, పోతుగల్

వ్యాధులు ప్రబలకుండా డ్రైడే పాటించండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా డ్రైడేలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. వరదలతో ప్రాణనష్టాలు లేకుండా చూడాలన్నారు. పాత ఇళ్లల్లో నిద్రించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాన్నారు. డ్రైయినేజీ సమస్యలతో మంచినీరు కలుషితమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించాలన్నారు. ఎవరు ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా సంక్షేమ అధికారులు, సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, అంగన్‌వాడీ పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. డెంగీ, మలేరియా, వాంతులు ఒక్క కేసు కూడా నమోదు కాకుండా చూడాలన్నారు. ఎన్నికల సెక్టోరియల్ అధికా రులు క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులు పరిశీలించి, నివేదిక ఇవ్వాలన్నారు. అడిషనల్ కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈవో రమేశ్‌కుమార్, డీపీవో రవీందర్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, జౌళిశాఖ ఏడీ సాగర్, డీఏవో భాస్కర్, మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, మైనింగ్ ఏడీ సైదులు, క్రీడల అధికారి రాందాస్ పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లను బదిలీ చేయాలి

సిరిసిల్ల: జిల్లాలో ఆసరా పెన్షన్ల బదిలీ చేపట్టాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్హులైన రైతులకు రుణమాఫీ అందేలా చూడాలన్నారు. జీవో 59లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంశాలను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీఆర్డీవో ఎన్.శ్రీనివాస్, జిల్లా ఇరిగేషన్ అధికారి జి.శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో భాస్కర్ పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసనలు

- వరుస ధర్నాలు..ఆందోళనలు
- స్వర్ణకారుల దుకాణాల బంద్
- వర్షంలో ఎన్‌హెచ్‌ఎం వంటా..వార్పు
- సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం నిరసనలు హోరెత్తాయి. ప్రజాసంఘాలు, కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులు ధర్నాలు చేపట్టారు. కలెక్టర్, అంబేడ్కర్‌చౌక్‌లో వరుస నిరసనలు చేపట్టాయి. భారీ వర్షంలో సైతం తమ హక్కుల సాధనపై ప్రభుత్వ తీరుపై ఆందోళనలు చేపట్టాయి.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి



తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సిరిసిల్లలోని అంబేడ్కర్‌చౌరస్తాలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అసువులు బాసిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యుం, ఇప్పపూల దేవేందర్, నగేష్, రవి, చైతన్య, జయంతి, లావణ్య, రాజేశ్వర్‌రావు, చందన్ తదితరులున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి



నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోరారు. ఈమేరకు సోమవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన శిబిరంలో భారీ వర్షంలోనూ వంటావార్పు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా వెట్టిచాకిరీ గురవుతున్న ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ వర్కర్లు ఉద్యోగాలు ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. పి.రాణి, గిరిధర్, శ్వేత, ఫాజల్, ప్రవీణ్, సునంద, పర్వీన్, వనిత, వెంకటేశ్, బాలకృష్ణ, లలితమ్మ, రాజమణి, శేఖర్ పాల్గొన్నారు.

స్వర్ణకారులకు చేయూతనివ్వాలి



కార్పొరేట్ జ్యువెల్లరీతో ఉపాధి కోల్పోతున్నామని, ప్రభుత్వమే చేయూతనందించాలని కోరుతూ సిరిసిల్ల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం దుకాణాలు బంద్ చేసి నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆ సంఘం అధ్యక్షుడు చొప్పదండి నర్సింహచారి, ప్రతినిధులు టి.రమేశ్, సుంకోజు రమేశ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సుద్దాలలో జీపీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని సుద్దాలలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన జీపీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ గిరిజనులు కూడా స్వయం పాలన చేసుకోవాలని తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. మండలంలోని 28 జీపీలకు 22 కొత్త భవనాలు మంజూరైనట్లు తెలిపారు. సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి, ఎంపీటీసీ మమత, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, కొలనూర్ సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మహేశ్, ఉపసర్పంచ్ నాగరాజు, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

రాజన్నసేవలో చల్మెడ



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: బీఆర్‌ఎస్ పార్టీ వేములవాడ అసెంబ్లీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు దంపతులు సోమవారం రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి ప్రసాదం అందించారు.

రాజన్న ఆశీస్సులతో గెలుస్తా..

అసెంబ్లీ ఎన్నికల్లో రాజన్న ఆశీస్సులతో భారీ మెజార్టీతో గెలుస్తాననే విశ్వాసం తనకుందని బీఆర్‌ఎస్ వేములవాడ అసెంబ్లీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. టిక్కెట్ కేటాయించిన తర్వాత సోమవారం మొదటిసారి రాజన్నను కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు.

పాలకుల అలసత్వంతోనే ఇబ్బంది

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



బొల్లారం వద్ద చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: పాలకుల అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యంతోనే మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలతో ప్రజలకు ముంపు పొంచి ఉందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. వేములవాడ మండలం బొల్లారం, లింగంపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ చెక్‌డ్యాంతో పొలాలు, ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. చెక్‌డ్యామ్ ఎత్తు ఉండడంతోనే నెలక్రితం మామిడిపల్లిలో 200 ఎకరాలు కొట్టుకుపోయాయన్నారు. ఇప్పటికైనా ఎత్తును తగ్గించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, నాయకులు గోవర్ధన్, సంగ స్వామి, ప్రభాకర్, బాలసాని శ్రీనివాస్, దశరథం, నర్సింహారెడ్డి ఉన్నారు.

ప్రజావాణి ఆలకించండి

- కలెక్టరేట్‌కు బారులుతీరిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి



అదనపు కలెక్టర్ ముందు గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత రైతు

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూల నుండి బాధితులు వచ్చి కలెక్టర్ అనురాగ్ జయంతికి సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాధితులకు సత్వర న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణికి మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్ ఉన్నారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి..

అధికారుల సూచనలతో కూరగాయలు సాగుచేసి పూర్తిగా నష్టపోయానని.. పరిహారం చెల్లించాలని కోరుతూ ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన రైతు మెట్ల లింగారెడ్డి అదనపు కలెక్టర్‌ను ఖీమ్యానాయక్‌ను కోరారు. పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి రాగా గమనించిన సిబ్బంది వెంటనే ఆ డబ్బాను తీసుకున్నారు. రైతు మాట్లాడుతూ అధికారుల సూచనలతో రూ.2లక్షలు పెట్టి పందిరిసాగులో కూరగాయలు వేసినట్లు తెలి పారు. అయితే పంట పూర్తిగా పోయి పెట్టుబడి కూడా రాలేదని.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి పలువురిని ఉత్తమ పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసింది. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

స్కూల్ అసిస్టెంట్.. కె.కరుణాకర్‌రెడ్డి(గ్రేడ్–2 హన్మాజీపేట), కె.సరిత(సిరిసిల్ల బాయ్స్), ఎన్.భాస్కర్ (కొందాపూర్), బి.సంజీవ్‌కుమార్(రాచర్లగొల్లపల్లి), వి.ప్రభాకర్(అంబేద్కర్‌నగర్, సిరిసిల్ల), ఆర్.సదానందం(రామోజీపేట, ఇల్లంతకుంట), ఎస్.లక్ష్మారెడ్డి(జిల్లెల్ల), వి.బిందుమాధవి(బదనకల్, ముస్తాబాద్), జి.శేఖర్(వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట), పి.రామచంద్రం(గజసింగవరం, గంభీరావుపేట), జి.కీర్తి(ఒబులాపూర్, తంగళ్లపల్లి), సీహెచ్.వెంకటేశ్వర్‌రావు(పెద్దలింగాపూర్, ఇల్లంతకుంట), ఎంఎ హమీదుల్లాఖాన్ (వేములవాడ), ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం.. జి.శ్రీనివాస్(ముస్తఫానగర్, గంభీరావుపేట), లాంగ్వేజ్ పండిట్స్..జి.వెంకటయ్య(వట్టింల), డి.శ్రీనివాస్(బాలరాజుపల్లి), పి.నారాయణ(నాగంపేట), సీహెచ్ రాజశేఖర్(అనంతారం), పీఈటీ.. బి.అనిల్‌గౌడ్(రాచర్ల గొల్లపల్లి), సెకండరీ గ్రేడ్.. బి.శారద(పద్మనగర్, సిరిసిల్ల), బి.రవీందర్ (గజసింగవరం), ఎ.మల్లేశం(జవారీపేట), బి.అరుణ(గీతానగర్, సిరిసిల్ల), కె.శ్రీనివాస్(అంబేద్కర్‌నగర్, ఒబులాపూర్), బి.అరుణ(చీర్లవంచ), ఎం.పద్మ(చీర్లవంచ), కె.రాజేశం(కోనరావుపేట), సీహెచ్.రజిత(రాచర్లబొప్పాపూర్), ఎస్.సంపత్‌కుమార్(చీర్లవంచ), మోడల్‌స్కూల్స్.. జి.మధుకర్(రహీంఖాన్‌పేట), ఎం.నర్సయ్య(వీర్నపల్లి) కేజీబీవీ.. కె.పావని(ఎస్‌వో పెద్దూరు), వి.సుజాత(సీఆర్టీ, తంగళ్లపల్లి), తెలంగాణ రెసిడెన్షియల్స్ : జి.రాధ(నేరెళ్ల).

వర్షంలోనూ మొక్కు చెల్లించేందుకు..





వేములవాడ: శ్రావణ సోమవారం కావడంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేములవాడ రాజన్నను 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయలేదు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు సాధారణ గేట్లకు తాళాలు వేశారు. భక్తుల ద్వారా రూ.35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, తిరుపతిరావు, అల్లి శంకర్ పరిశీలించారు.

గుట్టలను ముద్దాడిన మేఘం



తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి, మిడ్‌మానేరు జలాశయం శివారులో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. మేఘాలు గుట్టలను తాకుతూ చూడముచ్చటగా కనిపించింది. కనుచూపు మేర పచ్చని గడ్డి.. మధ్యలో మిడ్‌మానేరు నీరు.. గుట్టలపై మేఘాలు చూపరులను కట్టిపడేశాయి. – తంగళ్లపల్లి(సిరిసిల్ల)